# వి
# జ
# య
# వి
# లా
# స
# ం.

దూరంనుంచి పదిగంటలు వినిపించాయి. చలపతి ఓసారి అటూఇటూ మసిలి, తిరిగీ కళ్ళు మూసుకొన్నాడు. ఆవరణలో సంచారం లేదు. గేటుదగ్గ రున్న కాపలావాడుండి వుండి పొడిదగ్గు దగ్గుతున్నాడు. వరండాలోని హరికేన్ లాంతరుచుట్టూ, పురుగులు ఎగురుతున్నాయి. అప్పటిదాకా, పిచ్చాపాటీ మాట్లాడుతున్న తోటి ఖైదీ గూడా నిద్ర పోయాడు. అదేం గ్రహచారమోగానీ, తనకు మాత్రం నిద్ర పట్టలేదు. కళ్ళెంలేని గుర్రంలా, ఆలోచనలు స్వాధీనంలో ఉండటం లేదు. మానవుడేదో భ్రమలో ఉండి, తను సర్వస్వతం త్రుణ్ణని అనుకోవటమేగానీ, అతగా డెన్నింటికో బానిసేమో ననిపిస్తోంది తనకు. డబ్బుకు, ప్రేమకు, అధికారానికి, కులానికి, మతానికి, వర్గానికి, తనకు తెలియని వాటి కెన్నింటికో

మానవుడు బానిస! ఆ మాట ఒప్పుకునేందుకు, అతనికే తెలీని ఏ అంతర్గతశక్తో వ్యతిరేకించడం వల్లనే, తను స్వతంత్రుణ్ణని గట్టిగా అనుకొని, తనను తను మోసపుచ్చుకొంటున్నాడేమో! మనిషి పరిస్థితులను మార్చుతాడనడం, నిజమో కాదో తనకు తెలీదుగానీ, పరిస్థితులు మాత్రం మనిషిని దివ్యంగా మారుస్తాయి. ఇది అనుభవంమీద తను తెలుసుకొన్నాడు. లేకపోతే, హాయిగా కాలుమీద కాలు వేసుక్కూచో వలసిన తనకీ జైలువాసమేమిటి! ఎందుకు తెచ్చుకొన్నాడు తనిదంతా?

మనిషిలో దాచిపెట్టగలిగిన శక్తంటూ ఉండబట్టిగాని, లేకపోతే ఎన్నో అవగుణాలు, కుత్సితాలు, దుష్టభావాలు వెలికొచ్చి, ఎన్నెన్నో బాహిరమైన విలువలు నశించి ఉండేవి. పైకి గొప్పగా కనిపించే అనేకమంది అంతర్గత జీవితం ఎంత కల్లోలంగా ఉంటుందో, ఎంత జుగుప్సాకరంగా ఉంటుందో, ఆలోచించడానికే తనకు భయం వేస్తున్నది! అనేక గొప్ప కార్యాల వెనుకనున్న ప్రోద్బలాలు చాలా స్వల్పమైనవంటే, తనిప్పుడు తప్పకుండా నమ్ముతాడు. అందుకు ఉదాహరణ తనే!

తన కసలు దేశమంటే ఏ అభిప్రాయమూ లేదు. దేశభక్తి అంతకన్నా లేదు. ఆ బిరుదు తగిలించుకోవలసి వస్తుందని తనెప్పుడూ అనుకోలేదు. మన కిష్టంలేని అనేక గొప్పతనాలు మన ప్రయత్నం లేకుండానే మనల్ని ఆవహిస్తున్నాయి.

వాటిని కాపాడుకోనడంకోసం - ఆ తరువాత పడవలసిన ఇబ్బందులతో పోలిస్తే. ఆ గొప్పతనం లేకపోవడమే నయమేమో ననిపిస్తోంది!

తనిప్పుడో దేశభక్తుడు. గొప్ప రాజకీయవేత్త. విప్లవకారుడు. తననుగురించి పత్రికలు వ్యాసాలు వ్రాశాయి. ఫోటోలు వేశాయి. జైలు కొచ్చేనాడు, తను పూలదండల్లో మునిగిపోయాడు. సంకెళ్ళు తగిలించి, తనను పోలీసులు నడిపిస్తుంటే ప్రజలందరూ తనకు జేజేలుకొట్టారు. మరొకరయితే ఆ సంరంభానికి సంతోషించేవారేమో కానీ, తనకు మాత్రం భరించలేనంత విచారం కలిగింది. జైల్లో ఉండవలసివచ్చినందుకు గాదు; విజయకు దూరమైపోతున్నందుకు. తనతోబాటు విజయ గూడా జైలుకొచ్చినట్లయితే?...రాదు. రాదని తెలిసిగూడా తను అనేకసార్లు 'వచ్చినట్లయితే' అనుకొన్నాడు. అలా; కాని పనులన్నీ, అయినట్లయితే - అనుకొని తృప్తిపడటం మానవ స్వభావంలో ఉన్న బలహీనతేమో!

'విజయ' అనే ప్రాణి ఈ దేశంలో లేకపోతే, చలపతి రావనే విప్లవకారుడూ ఉండేవాడు కాడు. లోకం తనను ఏమనుకోనీగాక, తనుమాత్రం విజయకోసమే ఈ గొడవల్లోకి దిగాడు.

విజయ! ఎంత ముచ్చటగా ఉంటుందా పేరు!! తను ఎన్నివేలసార్లు అనుకొన్నాడు! ఎంత అందంగా ఉంటుంది! పచ్చగా, ఏపుగా, ఎదిగిన గన్నేరు గుబురులా, విల్లంబులా,

ఇంద్రచాపంలా ఉంటుంది. ముతకచీరె, తెల్లటి జాకెట్టు, భుజం నుండి వేళ్ళాడే మొద్దుసంచి, నల్లటి ఆకుచెప్పులు, చిన్ని నోరు, గుండ్రని భుజాలు, మెడమీది చిన్ని ముడత, చెంపలమీది నేవళం-ఏమైతేనేం, అన్నింటినీ, ఆ నినాదాలకూ, ఊరేగింపులకూ అంకితం చేసింది విజయ!

తన ఖర్మకాలి, తన కీ రాజకీయాలతో బొత్తిగా పరిచయం లేదు. తన పాపిష్టి కళ్ళకు అన్ని పార్టీలూ ఒక్కలాగే ఉంటాయి. అటువంటివాడి నుండి విజయ, వందరూపాయల చందా వసూలుచేసింది. మీటింగుకు రప్పించింది.

ఆ తరువాత తను అనేక సభలకు వెళ్ళాడు. అందుకు సంబంధించిన అనేకమందితో పరిచయం చేసుకొన్నాడు. అలాంటివారిలో కొందరు తనకు దగ్గరగా వచ్చారు. అలా వచ్చినవారి జాబితాలోకే విజయకూడా వస్తుంది.

ఓసారి ఓ మీటింగయ్యాక తను ఇంటికి వస్తున్నాడు. విజయ ఎదురుపడి నవ్వుతూ పలకరించింది తనను.

"మీరు ప్రతి మీటింగుకూ వస్తున్నారనుకొంటానే!" అన్నది విజయ.

తను 'ఔ' నన్నాడు.

"మీ అభిప్రాయ మేమిటి?" అన్నది విజయ నడుస్తూ నడుస్తూ, తక్కున నా ముఖంకేసి, చూసి.

"బాగానే జరుగుతున్నాయ్! జనం కూడా విపరీతంగా వస్తున్నారు" అన్నాడు తను రవంత తికమకపడుతూ.

"ఈ పోలీసుల బెడద లేకపోతే ఇంకా వస్తారు మాస్టారూ! ప్రభుత్వం చాలా దారుణంగా వ్యవహరిస్తోంది. ఒక్కో మీటింగు జరపడానికి బ్రహ్మ ప్రయత్నం చెయ్యాలి సొస్తోంది !"

"వస్తుంది" అన్నాడు తను—ఏమనటానికీ పాలుపోక.

"ఇన్ని ఉపన్యాసాలు విన్నారుగదా! ఈ రాజకీయాల పట్ల మీ ఉద్దేశమేమిటి ?" అడిగింది విజయ, అసలు విషయంలో కొస్తూ.

విజయతో మాట్లాడడం ఓ గొప్పవరం. ఎదుటివారి చూపుల్ని ఆకట్టి, వొంచి, తన అభిప్రాయాలను వొప్పించే శక్తి ఆమెలో అపారం! తన ఉద్దేశాలకు భిన్నమైన ఉద్దేశా లున్నవారిని ఆమె ఎంతమాత్రం సహించేదికాదు. ఆ కారణం గానే, తనకిష్టమున్నా, లేకున్నా, ఆమె విధానాలన్నింటినీ తను ఆమోదించాడు. ఆమె అభిప్రాయాలను నిస్సంకోచంగా బలపరిచాడు. మనం మనసారా అభిమానించే వ్యక్తిలో ఉన్న ఎలాంటి లోపాన్నయినా క్షమించగలం! మన వ్యతిరేకుల్లో ఉన్న ఎంత మంచి గుణాన్నయినా, ఒక్కోసారి లెఖ్ఖలోకి తీసుకోము. విజయపట్ల తన విధానం, అక్షరాలా అంతే జరి గింది! విజయ సాంఘికజీవితంతో తనకు ప్రమేయం లేదు. ఆవిడ ఆలోచనా విధానాలతో తనకు నిమిత్తంలేదు తనకు విజయ మాత్రంకావాలి. అందుకోసం, తన కిష్టంలేని అనేక పనులు చేశాడు. 'వెకిలితనం' అనుకొంటూనే తనూ ఉపన్యాసా

లిచ్చాడు. నినాదాలిచ్చాడు. గొప్ప గొప్ప నాయకులకు జైజైలు కొట్టాడు. ప్రభుత్వం నిషేధించిన పనులు చేశాడు. అదిచేసిన శాసనాలకు ఎదురు తిరిగాడు.

అయినా ఎక్కడో ఏదో వెలితి ఉన్నట్టు తనకు అనుమానంగానే ఉండేది! అదేమిటో తను తెలుసుకోలేక పోయాడు. చేస్తున్న పనిమీదగాక ఆ పని చెయ్యడానికి కారణభూతమైన ప్రేరణల మీదనే తన దృష్టి ఉండేది. బహుశా అందుకే తనకేదో వెలితి ఉన్నట్టనిపిస్తున్నదేమో - ననుకొన్నాడతను.

తన మనస్సంగీకరించని ఈ పనులవల్లే, తను గొప్పవాడయ్యాడు. అందరూ తనను దేశభక్తుడన్నారు. యువనాయకుడన్నారు. చుట్టూ వందిమాగధులు చేరారు. "ఓహోహో" అంటూ స్తోత్రాలు వల్లించారు. ఉన్నత స్థానమిచ్చారు. దాన్ని కాపాడుకోవడం కోసం, మరింత ఆత్మవంచన, మరింత నటన, మరిన్ని హంగులు అవసరమయ్యాయి. విజయకూ, తనకూ పెళ్ళి జరిగినప్పుడు పెద్దపెద్ద నాయకులందరూ సందేశాలూ, ఆశీస్సులూ అందించారు. ఓ గ్రామీణనాయకుడు విజయను భారతమాతగానూ, తనను భారతపితగానూ చిత్రించాడు.

ఈ "భారతమాత" కోసం తను కులాన్ని వొదిలాడు, ఆస్తిని వొదిలాడు, బంధువుల్ని వొదిలాడు! అయినా తనకు విచారమనిపించ లేదు. అందరూ తనను "సంస్కర్త" అన్నారు. "గొప్ప త్యాగి" అన్నారు.

తనవల్ల సంఘంలో మహత్తరమైన పరిణామం రాబోతున్నదన్నారు. ఏదో చైతన్యం వెల్లివిరియబోతున్నదన్నారు. ఆ మాటలన్నీ వింటున్నప్పుడు, తను సంతోషించాలో, విచారించాలో తెలియలేదు. ఎవరెన్ని అంటున్నా అసలు సంగతి తనకొక్కడికే తెలుసు. ఈ మిధ్యా గౌరవాల బరువును మోయలేక, ఎప్పుడన్నా ఎదురు తిరిగి, అసలు విషయం ఎలుగెత్తి చాటుదామనిపించేది. తను చాలా మామూలు మనిషినేననీ, దేశంమీదా, సంఘం మీదా అభిమానంవల్ల త నీ పనులన్నీ చెయ్యలేదనీ, విజయ కోసమే చేశాననీ, బిగ్గరగా అరవాలనీ అనిపించేది. కానీ, త నాపని ఎప్పుడూ చెయ్యలేదు. చెయ్యలేడుకూడానేమో! విసుగెత్తి, తన నిజస్వరూపం చూపించినా వీళ్ళు నమ్మరు. అదీ ఓ గొప్పతనంకిందనే వీళ్ళు జమకడతారు. అబద్ధం రుచించినంతగా, నిజం రుచించదేమో ననిపిస్తుంది!

నిజంగా - అలాంటిదే జరిగిననాడు విజయ తప్పకుండా ఖేదిస్తుంది. తనేదో మోసపోయినట్టు బాధపడుతుంది! అలా తను బయటపడిన మరుక్షణం - తనకు అందకుండా, రెక్కలు కట్టుకొని ఎగిరిపోతుం దనిపించింది. ఈ భయం నిరాధారమైతే కావచ్చు. కానీ, తను భయపడ్డమాట మాత్రం నిజం!

అందుకే తను, ఇంకొకరి జీవితం జీవించాడు. ఇంకొకరి అభిప్రాయాలకు, ఉద్దేశాలకు తను ప్రతిధ్వనిగా ఉండిపోయాడు. తనకు సొంత జీవితంలేదు. సొంత ఆలోచనలు లేవు. తనంతా విజయ జీవితంతో పెనవేసుకు పోయాడు. ఇందువల్ల, తన

వ్యక్తిత్వం నశించిపోతున్న దేమోనని, తను అనుకోలేక పోయాడు. తను విజయ చేతిలోని కీలుబొమ్మనేమో నన్న దుష్టపుటాలోచన తన కెన్నడూ రాలేదు. విజయ సంతోషించడం కన్నా తనకు కావలసిం దేమీ లేదు. ఆమె ఆనందమే తన ఆనందం. ఆమె తృప్తే తన తృప్తి.

విజయ ప్రోత్సాహం మీదనే, తనా "అలజడి"లో పాల్గొన్నాడు. పట్టాలు పెళ్ళగించడంవల్లా, తీగెలు కత్తిరించడంవల్లా ఏదో వొరుగుతుందని తను అనుకోలేదు. అయితేనేం, అది గొప్ప దేశభక్తిగా విజయ విశ్వసించింది. అందువల్ల ఏవో సత్ఫలితా లుంటాయని విజయ వాదించింది. ఆమె ప్రోద్బలం లేక పోతే. తనా గొడవల్లో దిగకనే పోయేవాడు.

ఏమైతేనేం గాని, అనుకొన్న ఫలితాలు మాత్రం రాలేదు. తన్ను పోలీసులు పట్టుకొన్నారు. కోర్టు ఏడేళ్ళు 'కఠిన నరకం' అనుగ్రహించింది.

జైలు గేట్లో అడుగు బెట్టుతున్నప్పుడు, తను దుఃఖాన్ని అణచుకోలేక పోయాడు. విజయకూడా కళ్ళల్లో నీళ్ళు పెట్టుకొంది. తనకూ, విజయకూ మధ్య ఏడు సంవత్సరాల గండి పడింది. ఇంతకాలమూ విజయ ఎక్కడ ఉంటుంది? ఏమి తింటుంది? ఎవరి పంచన తల దాచుకొంటుంది?

ఈ ప్రశ్న లన్నింటికి పద్మనాభంగారు జవాబులిచ్చారు. విజయను గురించి విచారించ నక్కర్లేదన్నారు. ఆమె బాధ్యత లన్నీ తను సంతోషంగా స్వీకరిస్తానన్నారు. ఆమెకు ఎందునా

ఎటువంటి లోటూ రానివ్వనన్నారు. ఆ హామీ వారి నుండి పొందాకగానీ తను స్థిమితపడలేదు.

తను రాయవేలూరులో వున్నప్పుడూ, రాజమండ్రిలో వున్నప్పుడూ, విజయ-పద్మనాభంగారలు తన్ను చూడటానికి వచ్చారు. విజయ తన కెప్పుడూ ఉత్తరం వ్రాయలేదు గానీ, పద్మనాభం మాత్రం రాస్తుండేవాడు!

విజయను చూసినప్పుడల్లా, తన కేదో అలజడిగా ఉండేది. ఆమె ఎందుకో బాధపడుతున్నట్టు తన కనుమానం వేసేది.. అదేమిటో విజయ చెప్పలేదు. తను నోరు విప్పి అడిగితే 'ఆఁ, ఏమీ లేదు' అని పొడినవ్వు నవ్వేది. బహుశా తన నుండి దూరమయినందుకే అలా బాధపడుతున్నదని తను సరిపెట్టుకొన్నాడు.

అదృష్టవశాత్తూ తను ఏడేళ్ళు జైల్లో ఉండ నవసరం లేకపోయింది. ఏదో ఉత్సవాన్ని పురస్కరించుకొని రాజకీయ ఖైదీలందర్నీ రేపు విడుదల చేస్తారట! అంటే, తనకూ, ఈ జైలుకూ ఈ రాత్రితో రుణం తీరిం దన్నమాట! మరో ఏడు గంటలకల్లా తను దీనినుండి బైటపడతా డన్నమాట!!

చలపతిరావు హృదయం ఆనందంతో నిండిపోయింది. కొత్తనెత్తురేదో వంటినిండా అలజడి చేస్తున్నట్టు ఫీలయ్యాడు. అతని మనస్సు ఇరవై నాలుగ్గంటలు ముందుకు వెళ్ళి, విజయ చుట్టూ పరిభ్రమిస్తున్నది! విజయ, తన విజయ!! చిన్ని పెదవులు, తెలివిగా తళతళలాడే కళ్ళు, మెడమీది గీర, భుజాల

కిందిగా, అందంగా, గుండ్రంగా పాకిన నీడలు, పొట్టమీది ముడత, కుచ్చెళ్ళ కదలిక, మనస్సులో తీవ్రంగా మెదిలాయి. రెండు కాళ్ళూ ముడుచుకొని, గుప్పెళ్ళు బిగబట్టి తనలో తనే నవ్వుకొన్నాడు చలపతిరావు !

## 2

దూరంనుంచి పదిగంటలు వినిపించాయి. చలపతి ఓసారి అటూ ఇటూ మసిలి, తిరిగీ కళ్ళు మూసుకొన్నాడు. గేటు దగ్గరున్న కాపలావాడు, ఉండి ఉండి పొడిదగ్గు దగ్గుతున్నాడు. అప్పటిదాకా తనతో పిచ్చాపాటీ మాట్లాడుతున్న పద్మనాభం గారు లోపలి కెళ్ళిపోయారు. గదిలో ఓమూలగా, తన కిందాక వేసిన పూలదండలన్నీ రాశిగా ఉన్నాయి. వీధిలో జట్కా.మోత, దూరంగా కుక్క అరుపు...

ఒక్కసారి గట్టిగా కళ్ళు నులుముకొన్నాడు చలపతి. ఒళ్ళు విదిలించుకొని, అలాగే కుర్చీలో చేరగిలబడ్డాడు.

తన కెంతో ఆనందాన్ని ఇవ్వవలసిన ఈ రోజు, ఎంచేతో అనుకొన్నంత ఆనందంగా లేదు. ఏవో దిక్కుమాలిన ఆలోచన లన్నీ మనస్సులో మెసిలి, తన సుఖాన్ని పాడుచేస్తున్నాయి. తను ఖైదులో ఉండగా విజయను గురించి మరోకలాగా అను కోలేదు. ఆవిడ నైతికజీవితాన్ని గురించి తన కెలాంటి ఆలో చనా రాలేదు. నిజాని కది తన పొరబాటే !

ఇందులో పద్మనాభాన్ని గానీ, విజయను గానీ తను తప్పుపట్టబోవడం లేదు. ప్రతి పని వెనుకా ఎంతో కొంత స్వార్థం ఉండక తప్పదనే సిద్ధాంతమే నిజమయితే, ఇందులో తప్పుపట్టడానికేమీ లేదు. తను విజయకోసం ఎన్నింటిని వొదులుకోలేదు! ఎంత ఆత్మవంచన చేసుకోలేదు! ఎంతగా నటించలేదు! ఆ పనే యిప్పుడు పద్మనాభమూ చేసినప్పుడు, దాన్ని తను ఆమోదించటంలో దోషం లేదేమో! తన జీవిత సర్వస్వాన్నీ ఆవహించిన ఓ గొప్పశక్తిని, అతను అయిదేళ్ళు పదిలంగా కాపాడి, తిరిగీ తన స్వాధీనం చేశాడు. అతనే ఆదుకోకపోతే, విజయగతి ఏమై ఉండునో తను ఊహించడానికే భయపడుతున్నాడు. విజయ చెడిపోయిందన్న అర్థాన్నిచ్చే మాటలు, ఒకరిద్దరు సన్నిహితుల నుండి ఇందాక తను విన్నాడు. వారే పద్మనాభాన్ని పడతిట్టడమూ తను విన్నాడు. వాటిని అర్థంచేసుకోవడ మెలాగో తనకు తట్టడంలేదు. విజయకోసం ఇన్ని త్యాగాలు చేసిన తను, ఈ విలువనూ త్యాగం చెయ్యలేకపోడు వీరు అనుకొంటున్న దాన్నిబట్టి చూస్తే, విజయ నైతిక జీవితాన్ని మాత్రమే తను అభిమానిస్తున్నట్టు అర్థంచేసుకొన్నారేమో ననిపిస్తున్నది. అదే అయితే, వారు పొరపాటు పడ్డారనే చెప్పాలి. తనకు నైతిక విలువలు తెలీవనీ, లేవనీ, వారనుకొంటే అనుకోవచ్చు. అందుకోసం అన్ని త్యాగాలు చేసి సంపాదించుకొన్న విజయను వదులుకోడానికి తను సిద్ధంగాలేడు. పైపెచ్చు పద్మనాభానికి కృతజ్ఞ

తలు చెప్పుకోవాలనిపిస్తోంది! పదిమందీ వింటే విడ్డూర మను కొంటారు. అయినా, తనెన్ని విడ్డూరమైన పనులు చేశాడు గాదు!

చలపతి దీర్ఘంగా నిట్టూర్చాడు. ఒక్కసారి గట్టిగా వొళ్లు విదిలించుకొని కుర్చీలోనించి లేచాడు. తలుపు మూలగా విజయ తలొంచుకొని నిలబడి ఉంది. మెల్లగా దగ్గర కెళ్ళి, అంతకన్నా మెల్లగా ఆమె ముఖాన్ని పైకెత్తాడు. విజయ కళ్ళల్లో నీరు నిండిపోయి ఉంది! ముఖాన్ని రెండుచేతుల్లోనూ దాచుకొని కుప్పగా కూలిపోయింది.

"ఎందు కమ్మడూ విచారం!" అన్నాడు చలపతి ఆమెను మృదువుగా లేవనెత్తి, మెత్తగా కౌగిలించుకొంటూ.

తను ఎందుకు విచారిస్తున్నదో విజయ చెప్పలేదు గానీ, ఆమె హృదయం మాత్రం "త్యాగం, త్యాగం" అంటూ నిశ్శబ్దంగా ఘోషించింది!